క్లుప్తంగా

ఘనంగా సహస్ర దీపాలంకరణ



సహస్ర దీపాలంకరణలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి

పెనుకొండ: పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు సహస్ర దీపాలంకరణను ఘనంగా నిర్వహించారు. వేద పండితులు వేంకటేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహం వెనుక సహస్ర దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఆలయం ముందు పార్వేటోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

రేపు హనుమాన్ శోభాయాత్ర

హిందూపురం: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని 22వ తేదీ హనుమాన్ శోభాయాత్ర (బైక్ ర్యాలీ) నిర్వహిస్తున్నట్లు హిందూ సురక్షా సేవా సమితి సభ్యులు తెలిపారు. ఉదయం సూగూరు ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు ముగించుకుని ఉదయం 10 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ప్రధాన వీధుల గుండా మోడల్ కాలనీ వ్యాసరాయ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం వరకూ సాగుతుందన్నారు. ర్యాలీ అనంతరం అక్కడే భక్తులకు భోజన వసతి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా శోభాయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

26 నుంచి ట్యాలీపై వర్క్‌షాప్



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని సప్తగిరి కళాశాలలో ఈనెల 26 నుంచి 28 వరకూ మూడు రోజుల పాటు ట్యాలీపై ఉచిత వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి, పరిపాలన అధికారి గంగిరెడ్డి, రిసోర్స్ పర్సన్ విజయ్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగానే మంగళవారం ఆ కళాశాలలో కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కెరీర్ అకౌంట్స్, ఫైనాన్స్, ట్యాక్సేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ బేసిక్స్‌తో పాటు ట్యాలీపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణ తర్వాత అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

హిందూపురం: పట్టణంలోని శ్రీకంఠపురంలో వెలసిన గ్రామదేవతలు సుంకలమ్మదేవి, దుర్గమ్మ, పెద్దమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకంఠపురం, లక్ష్మీపురం, డీఆర్‌కాలనీ తదితర ప్రాంతాల నుంచి మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు.

జాతరలో దీపిక ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న సమన్వయకర్త దీపిక

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక మంగళవారం హిందూపురం పట్టణంలోని శ్రీకంఠపురంలో వెలసిన సుంకులమ్మదేవి జాతరలో పాల్గొన్నారు. ఆలయంలో అమ్మవారికి సమన్వయకర్త ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట నాయకులు మహేష్‌గౌడ్, వార్డు ఇన్‌చార్జి నాగరాజు, అయూబ్ బైగ్, సహారాబాను, బాబాజాన్, జయ, మురళి, నవీన్ ఉన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన

హిందూపురం: హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై ప్రజల్లో చైతన్యం రావాలి, వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదని హిందూపురం ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీకాంత్, ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ కళాబృంద నిర్వాహకులు అనిల్‌కుమార్ అన్నారు. హిందూపురం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో మంగళవారం అవగాహన వీధి నాటక ప్రదర్శన నిర్వహించారు. హెచ్ఐవీ, క్షయ వ్యాధులపై అప్రమత్తత అవసరమని, సుఖ వ్యాధిగ్రస్తుల మధ్య కలిసి తినడం, కలిసి జీవించడం వలన వ్యాధి వ్యాపించదన్నారు. కేవలం లైంగిక సంబంధం, రక్త మార్పిడి ద్వారా సోకుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్లు బాబు, విమలాకుమారి, మారుతీప్రసాద్, చైతన్య సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ తిప్పేస్వామి, నవీన్, మంజుల , జయమ్మ, పాల్గొన్నారు.



పెనుకొండ నగర వనం, ముఖద్వారం పక్కనే ఏర్పాటు చేసిన క్యాంటీన్



పార్కులో వివిధ రకాల మొక్కలను పెంచుతున్న దృశ్యం



ప్రారంభంకాకుండానే వచ్చిన పర్యాటకులు

ముస్తాబైన ‘పెనుకొండ నగర వనం’

- రూ.2 కోట్ల కేంద్ర నిధులతో పనులు
- ప్రారంభానికి ముందే తరలివస్తున్న పర్యాటకులు

పెనుకొండ: పట్టణానికి కూత వేటు దూరంలో అటవీశాఖ ఆధ్వర్యంలో పులేకమ్మ ఆలయం ఎదురుగా నిర్మించిన నగర వనం ముస్తాబైంది. నేడో, రేపో ప్రారంభించనున్నారు. ఇప్పటికే పర్యాటకులు పెద్ద ఎత్తున ఈ పార్కుకు తరలివస్తున్నారు.

రూ. 2 కోట్ల వ్యయంతో..

పెనుకొండ నగర వనాన్ని రెండేళ్లుగా తీర్చిదిద్దుతున్నారు. రూ. 2 కోట్లతో నిర్మాణమవుతోంది. గతంలో అటవీశాఖ ఉన్నతాధికారులు ఈ ప్రాంతం నగర వనానికి ఎంతో అనువుగా ఉంటుందని గుర్తించారు. దీంతో వెంటనే పెనుకొండ సమీపంలో పార్కు నిర్మాణానికి కేంద్ర అటవీశాఖ రూ. 2 కోట్లను విడుదల చేసింది. 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన నిర్మించిన పెనుకొండ నగర వనం రానున్న రోజుల్లో పర్యాటకులకు పెద్ద విడిది కేంద్రం కానుంది. ముఖ్యంగా వారాంతాల్లో బెంగళూరు, బాగేపల్లి, గౌరీబిదనూరు, చిక్‌బళ్లాపురం, అనంతపురం తదితర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే శని, ఆదివారాల్లో కర్ణాటక ప్రాంతం నుంచి పర్యాటకులు పెనుకొండకు తరలివస్తున్నారు.



చిన్నారులు ఆడుకునే క్రీడా పరికరాలు, చెట్ల కింద కూర్చునేలా ఏర్పాటు చేసిన అరుగులు

చిన్నా, పెద్దా మెచ్చేలా..

పెనుకొండ నగర వనంలో అటవీశాఖ అధికారులు ఆకట్టుకునే క్రీడా సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పెద్దలకు జిమ్, యోగా చేసుకోవడానికి అనువుగా ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు. అలాగే చిన్నారులు ఆడుకునేందుకు అనేక క్రీడా పరికరాలు అందుబాటులోకి తెచ్చారు. ఓపెన్ జిమ్, చిన్నారులకు ఉయ్యాలలు ఇతర పరికరాలు, వాకింగ్ పాత్, జాగింగ్ పాత్, ట్రెక్కింగ్ పాత్, క్యాంటీన్, పర్యాటకులు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేశారు. అలాగే వివిధ రకాలైన చెట్లను సైతం నాటి ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు.

ఈ ప్రాంతానికే తలమానికం



పెనుకొండ నగర వనాన్ని ఎంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. ఎంతో చూడముచ్చటగా ఉన్న ఈ పార్కులో ప్రతి వారాంతం కుటుంబంతో సహా సేదతీరేందుకు బాగుంది. పర్యాటకులు ఇక్కడికి క్యూ కట్టడం ఖాయం. ప్రధానంగా చిన్నారులు ఎంతో సంతోషంగా గడుపుతారు. ప్రతి ఒక్కరూ చూడదగింది పెనుకొండ నగర వనం. ప్రధానంగా హైవే పక్కన నిర్మించడం అందరికీ అనుకూలంగా మారింది.

– మధు, సోమందేపల్లి

త్వరలోనే అందుబాటులోకి తెస్తాం



పర్యాటకులను ఆకట్టుకునేలా పెనుకొండ నగర వనాన్ని తీర్చిదిద్దాము. చిన్న చిన్న పనులు కూడా త్వరగా పూర్తి చేస్తి పార్కును ప్రారంభిస్తాము. బాత్‌రూంలు, క్యాంటిన్ సౌకర్యం సైతం ఏర్పాటు చేసాము. ప్రధానంగా వాకింగ్ ట్రాక్, యోగాకు ఎంతో అనువుగా ఉంటుంది. చుట్టూ కొండలు, అటవీ ప్రాంతం కావడంతో ఎంతో ఆహ్లాదకంగా ఉంటుంది.

– శ్రీనివాసరెడ్డి, రేంజర్, పెనుకొండ

పర్యాటకులు క్యూ కడుతున్నారు



ఏడాదిన్నరగా పనులు నిరవధికంగా చేపట్టాము. ప్రస్తుతం నగర వనంలో పనులన్నీ పూర్తయి ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. పర్యాటకులు, ప్రజలు ఇక్కడ వచ్చి ఎంతో సంతోషంగా సేదతీరడానికి అనువుగా ఉంటుంది. ఇప్పటికే పర్యాటకులు క్యూ కడుతున్నారు. వారాంతాల్లో ఈ పార్కు బిజీగా పారడం ఖాయం. ప్రశాంతతకు అనుకూలమైన వాతావరణం ఇక్కడ ఉంది.

– శివరాం, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, పెనుకొండ

సోలార్ ప్లాంట్‌కు భూములివ్వండి



రొళ్ల: రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్

రొళ్ల: ప్రభుత్వం అసైండ్ భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుట్టిందని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్, ఉమ్మడి అనంతపురం జిల్లా ఎన్‌టీపీసీ, నెట్‌క్యాప్ కన్సల్టెంట్ జీబీ విశ్వనాథ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షేక్షావలితో కలిసి వీఆర్వోలు, సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. తొలుత సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన అసైండ్ భూములకు సంబంధించిన మ్యాప్, స్కెచ్‌లను పరిశీలించారు. ప్రస్తుతం మండలంలో ఐదు వేల ఎకరాల్లో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి అవకాశం ఉందన్నారు. అయితే అసైండ్ భూములు తక్కువగా ఉన్నందున రెండు వేల ఎకరాల్లో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి అవసరమైన భూములను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. రైతులు స్వతహాగా అసైండ్, పట్టాభూములు సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఇస్తే ఎకరాకు ఏడాదికి రూ.31 వేలు అందించడంతో పాటు ప్రతి రెండేళ్లకు ఒకసారి 5 శాతం పెంచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ గిరియప్ప, సీఎస్‌డీటీ భాగ్యలక్ష్మీ, సర్వేయర్ కిరణ్‌కుమార్, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుబ్బరావు, సిబ్బందితో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ జీబీ విశ్వనాథ్ సమావేశమయ్యారు. మండలంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం అందుబాటులో ప్రభుత్వ భూమి, పట్టా భూమి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

జీఓ నంబర్ 4 వెంటనే రద్దు చేయాలి



తహసీల్దార్ షేక్షావలికి వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోలు

రొళ్ల: సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన జీఓ ఎంఎస్ నంబర్–4ను వెంటనే రద్దు చేయాలని వీఆర్వోలు డిమాండ్ చేశారు. వివిధ గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ కార్యదర్శులు మంగళవారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చి తహసీల్దార్ షేక్షావలికి డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వీఆర్వోలు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలకు గ్రామస్థాయిలోనే రెవెన్యూశాఖకు సంబంధించిన అన్ని రకాల సేవలు అందించాలన్న ఉద్దేశంతో సచివాలయాలను తీసుకొచ్చిందన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ఒక వీఆర్వోను నియమించడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం రేషనలైజేషన్ పేరుతో రెండు సచివాలయాలు కలిపి ఒక వీఆర్వోను నియమించడానికి తెచ్చిన జీఓ ఎంఎస్ నంబర్–4ను వెంటనే రద్దు చేయాలన్నారు. దీని వల్ల వీఆర్వోలకు పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు గిరిష్‌కుమార్, చిరంజీవి, నాగరాజు, రంగనాథ్, నరసింహమూర్తి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వ్యక్తిపై దాడి

పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగు గ్రామానికి చెందిన నీరుగంటి ఆంజనేయులుపై మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. గ్రామానికి చెందిన మాజీ డీలర్ ఆంజనేయులు మామిడి పండ్ల వ్యాపారం నిమిత్తం కొత్తచెరువుకు వెళ్లాడు. తిరిగి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో మునిమడుగు గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. దాడి ఘటనలో గాయపడిన ఆంజనేయులు అటుగా వెళ్తున్న వారు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. క్షతగాత్రున్ని అనంతపురం తరలించి చికిత్సను అందిస్తున్నారు.

యువతి అదృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని చంద్రగిరి గ్రామానికి పూజిత (19) అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. రోజూ కంప్యూటర్ శిక్షణ కోసం పెనుకొండ పట్టణంలోని ఓ కంప్యూటర్ సెంటర్‌కు వెళ్లేదన్నారు. అయితే సోమవారం కూడా కంప్యూటర్ తరగతి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో గాలించినా ఫలితం లేకపోయిందన్నారు. దీంతో మంగళవారం యువతి తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అడదాకులపల్లిలో వివాహిత..

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని అడదాకులపల్లికి చెందిన జయమ్మ ఆరు నెలల క్రితం అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు అప్పటి నుంచి సమీప బంధువులతో పాటు వివిధ ప్రాంతాల్లో గాలించారు. అయినా ఫలితం లేకపోవడంతో చివరికి జయమ్మ భర్త రామాంజినేయులు ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయండి

సోమందేపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని సీపీఎం మండల కార్యదర్శి రంగప్ప విమర్శించారు. ఇటీవల తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్‌కు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు.

కోడిపల్లిలో కార్డెన్ సెర్చ్

లేపాక్షి: గ్రామీణా ప్రాంతాల్లో ఎవరైనా అల్లర్లు, గొడవలు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు తప్పవని హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ తెలిపారు. మంగళవారం ఉదయం కోడిపల్లిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం స్థానికులకు పలు సూచనలు, సలహాలిచ్చారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో జూన్ 1 నుంచి కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ హరీష్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ తెలిపారు. పదో తరగతి పాసై, ఇంటర్, డిగ్రీ (పాస్/ఫెయిల్) చదివిన 18 నుంచి 30 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ శివప్రసాద్ సెల్ నంబర్ 9676706976 సంప్రదించాలన్నారు.

ప్రజా ప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వండి

- మండల మీట్‌లో ఎంపీటీసీలు



ఎంపీడీఓపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీలు

లేపాక్షి: ప్రజల చేత, ప్రజల కోసం ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు మండల సర్వసభ్య సమావేశంలో డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీపీ వెంకటరత్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కంచిసముద్రం, కొండూరు ఎంపీటీసీ సభ్యులు ఆదినారాయణ, అశ్వత్థప్ప మాట్లాడుతూ మండల పరిషత్‌లో రూ.1.20 కోట్ల నిధులు ఉన్నాయన్నారు. ఎంపీటీసీ సభ్యులకు వేతనాలతో పాటు తమ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయడానికి నిధులు కేటాయించకపోవడం సరికాదన్నారు. మూడు సర్వసభ్య సమావేశాల్లో అభివృద్ధి పనుల కోసం ఎంపీటీసీ సభ్యులకు నిధులు కేటాయించాలని మొరపెట్టుకున్న పట్టించుకునే వారు కరవయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిధులు కేటాయించడానికి కలిగే ఇబ్బందులు ఏమిటో చెప్పాలని ఎంపీడీఓను ప్రశ్నించారు. ప్రజలు తమను గెలిపించింది ఇక్కడ కూర్చొని వెళ్లేందుకా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక పింఛన్లు పొందుతున్న పెన్షన్‌దారుల కంటే తమ పరిస్థితి అధ్వానంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఏడాది డిసెంబర్ 16వ తేదీ 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చిన తమ ఖాతాల్లోకి నగదు జమ కాలేదని పులమతి సర్పంచ్ అశ్వత్థనారాయణ వాపోయారు. మండల వ్యాప్తంగా ఎక్కువ మంది పాడి ఆవులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, మండలానికి పశుదాణా కేవలం 132 బస్తాలు మాత్రమే సరఫరా చేస్తే ఎలా అని కోడిపల్లి ఎంపీటీసీ సభ్యుడు గంగాధర్ ప్రశ్నించారు. పశువైద్యాధికారి కిషోర్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో చిటుక వ్యాధి నివారణ కోసం 4 వేల వ్యాక్సిన్లను పశువులకు వేశామని, పశు బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, లీలావతి, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓ కుళ్లాయప్ప, ఏఓ శ్రీలత, ఏఈ వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

రొద్దంలో తిరంగా ర్యాలీ



రొద్దంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రొద్దం: ఆపరేషన్ సింధూర్ విజయాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఇ.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై ఎలా నడవాలి?



ఇందిరమ్మ కాలనీలో బురదమయమైన రోడ్డును చూపిస్తున్న మహిళలు

అమరాపురం: మండల పరిధిలోని గౌడనకుంట ఇందిరమ్మ కాలనీ రోడ్డుపై కొందరు రైతులు పొలాలకు వేసుకోవడంలో భాగంగా మట్టిని రోడ్డుకు అడ్డంగా వేశారు. అయితే వర్షం పడటంతో అసలు నడిచేందుకే వీలుకాని విధంగా ఆ రోడ్డు బురదమయంగా మారిపోయింది. వెంటనే మట్టిని తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆ కాలనీ వాసులు స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు వెళ్లి అధికారులకు మంగళవారం వినతిపత్రం అందించారు. రామలింగప్ప, సిద్దరామప్ప, తిప్పేస్వామి, నింగన్న, రామేశ్వర తదితర రైతులు తమ భూములకు తరలించుకునే మట్టిని ఇందిరమ్మ కాలనీలో ఉన్న రోడ్డుకు అడ్డంగా మట్టి వేశారని స్థానికులు జయరామప్ప, సిద్దేశ్వర, జయమ్మ, శివమ్మ, పార్వతమ్మ, గంగమ్మ తెలిపారు. వర్షం రావడంతో నడిచేందుకు కూడా వీలులేదని, వెంటనే మట్టి తీయించాలన్నారు. అలాగే రోడ్డును సగ భాగం ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అధికారులు దీనిపై స్పందించాలన్నారు.

పెనుకొండలో దంచికొట్టిన వాన



పెనుకొండలో కురుస్తున్న వర్షం



రోడ్డుపై పారుతున్న నీటిపై వెళ్తున్న కారు

పెనుకొండ: పట్టణంలో మంగళవారం వాన దంచికొట్టింది. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో వర్షంతో పట్టణాన్ని ముంచెత్తింది. రెండు మూడు పర్యాయాలు వర్షం నిరవధికంగా కురవడంతో జనజీవనం స్తంభించింది. రోడ్లు, డ్రైన్‌ల గుండా వర్షం నీరు పొంగి పొర్లింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

సచివాలయ కన్వీనర్‌కు పరామర్శ



దేవరపల్లిలో శాంతమ్మను పరామర్శిస్తున్న సమన్వయకర్త దీపిక

చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండలం తూముకుంట పంచాయతీ దేవరపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామాంజినేయులు భార్య, సచివాలయ కన్వీనర్ శాంతమ్మను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎస్ దీపిక మంగళవారం పరామర్శించారు. కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు మహేష్‌గౌడ్ , సీనియర్ నేత శ్రీరామిరెడ్డి, ఎంపీటీసీ ధనుంజయరెడ్డి, మండల కన్వీనర్ రాము, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కవితారెడ్డి, దేవరాజు, బాలు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్‌కు..

హిందూపురం పట్టణంలోని 38 వార్డు కౌన్సిలర్ రాధమ్మ ఇటీవల ప్రమాదంలో గాయపడి బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాధమ్మను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

కనుమ మారెమ్మ ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమస్వయకర్త ఈరలక్కప్ప తదితరులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొందిలో మంగళవారం ఘనంగా కనుమ మారెమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆంజనేయస్వామి ఆలయం వద్ద కుర్చోబెట్టిన కనుమ మారెమ్మకు సమర్పించి పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు వైసీ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, మండల కన్వీనర్ రామిరెడ్డి, మాజీ వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజ్‌గౌడ్, తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

అంబేడ్కర్ రాజ్యాంగం సాటి లేనిది

పావగడ: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డా బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం సాటిలేదని ఎస్సీ,ఎస్టీ, బీసీలు రాజ్యాధికారం పొందుతున్నారంటే కేవలం అంబేడ్కర్ రాజ్యాంగం చలవేనని ఎమ్మెల్యే వెంకటేశ్ కొనియాడారు. తాలూకాలోని పెండ్లిజీవి గ్రామంలో మంగళవారం ఆయన నూతన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగలమడక గ్రామ పంచాయతీ అధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి, నేరళకుంటె నాగేంద్ర, వీఎస్ఎస్ఎన్ అధ్యక్షుడు పాలనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల నిరసన

గోరంట్ల: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానలను నిరసిస్తూ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు వ్యవసాయ, భవన నిర్మాణ, సీఐటీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టి నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి

పెనుకొండ రూరల్: ఇచ్చిన హామీ మేరకు వెంటనే కూటమి ప్రభుత్వం రైతులకు రూ. 20 వేల పెట్టుబడి సాయం అందించాలని సీఐటీయూ నాయకులు తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అలాగే లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికులందరికీ సమాన వేతనాలు ఇవ్వాలన్నారు. నాయకులు హరి, బాబావలి, నాగరాజు, బావమ్మ, మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందూపురం	31.0
పెనుకొండ	34.0
మడకశిర	31.0